ప్రజా పాలన సభలకు 58 టీమ్‌లు

- ఒక టీమ్ రోజుకు రెండు సభల నిర్వహణ
- 100 కుటుంబాలకు ఒక కౌంటర్
- ఇతర సమస్యల దరఖాస్తులకు జనరల్ కౌంటర్
- గ్రామాల వారీగా షెడ్యూల్ విడుదల
- విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ ప్రియాంక

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ ప్రియాంక, పక్కన అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేట, డిసెంబర్ 27 : ప్రజా పాలన సభలో ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ప్రియాంక తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరావుతో కలిసి ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ఈ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 475 గ్రామ పంచాయతీలు, 141 మున్సిపల్ వార్డుల్లో ఈ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరుగుతుందని వెల్లడించారు. 475 గ్రామ పంచాయతీల్లో 247 మంది సభ్యులతో 46 టీమ్‌లను ఏర్పాటు చేయగా ఈ టీమ్‌లు 2,581 కౌంటర్లలో దరఖాస్తులు తీసుకుంటాయన్నారు. అలాగే ఐదు మున్సిపాలిటీల పరిధిలోని 141 వార్డుల్లో 52 మంది సభ్యులతో 12 టీమ్‌లను ఏర్పాటు చేయగా 844 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 3,425 కౌంటర్ల ద్వారా దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని అందుకు గ్రామ సభల నిర్వహణకు 299 మంది సభ్యులతో మొత్తం 58 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఒక టీమ్ రోజుకు రెండు గ్రామ సభలను నిర్వహిస్తుందని, మొత్తంగా రోజుకు 116 గ్రామ సభల నిర్వహణ జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక గ్రామ సభ ఉంటే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో గ్రామంలో నిర్వహించే గ్రామ సభలో టీమ్ సభ్యులు పాల్గొంటారని చెప్పారు. గ్రామ సభ నిర్వహణ ముందు ఆ గ్రామంలో గానీ వార్డులో కాని ఇంటింటికీ దరఖాస్తులు అందిచడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఉంటుందన్నారు. కౌంటర్ ఇన్‌చార్జీలను సైతం నియమించినట్లు తెలిపారు. ప్రజలు ఈ ఆరు గ్యారెంటీల కోసమే కాకుండా ఇతర సమస్యలను విన్నవించేందుకు జనరల్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామ సభ ముగిసిన తర్వాత మిగిలిన రోజుల్లో ఒక కౌంటర్‌ను నిర్వహిస్తామన్నారు. జనవరి 6 వరకు ఈ కౌంటర్ పనిచేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రేషన్ కార్డు, ఆధార్‌తో పాటు ఫామ్ నింపుకుని రావాలని సూచించారు. ఫామ్ ఇచ్చిన అనంతరం రశీదు తీసుకోవాలన్నారు. ఏఎస్పీ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భారికేడ్లతో పాటు కౌంటర్ వద్ద ఒక కానిస్టేబుల్ ఉంటారని చెప్పారు.

ప్రజా పాలన సభలకు ప్రత్యేక అధికారులు

సూర్యాపేట : ప్రజా పాలన సభలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ప్రియాంక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట రూరల్–శిరీష, చివ్వెంల–జగదీశ్వర్‌రెడ్డి, పెన్‌పహాడ్–రాంపతినాయక్, నూతనకల్–సుధాకర్‌రెడ్డి, తిరుమలగిరి–మధవరెడ్డి, మద్దిరాల–శ్రీధర్, జాజిరెడ్డిగూడెం–రామరావునాయక్, మేళ్లచెర్వు–నామ శ్రీధర్, మోతె–తిరుపతిరెడ్డి, కోదాడ రూరల్–దయానందరాణి, చిలుకూరు–రూపేందర్‌సింగ్, మునగాల–శ్రీరాములు, చింతలపాలెం–నాగేందర్, నడిగూడెం–సతీశ్‌కుమార్, తుంగతుర్తి–జగ్గూనాయక్, ఆత్మకూర్(ఎస్)–నాగేశ్వర్ శర్మ, గరిడేపల్లి–సంతోశ్‌రావు, నేరేడుచర్ల–జ్యోతిపద్మ, పాలకవీడు–శంకర్, హుజూర్‌నగర్–యాదయ్య, అనంతగిరి–డాక్టర్ శ్రీనివాస్, నాగారం–సాంబిరెడ్డి, మఠంపల్లి–నవీకాంత్ నియమితులయ్యారు. వారికి తోడుగా మండల అధికారులు విధులు నిర్వహించనున్నారు.

అర్వపల్లి మండలం కాసర్లపహాడ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఏఓ రామారావునాయక్

ప్రజా పాలన సభల కోసం జిల్లా స్థాయి టీమ్ :

ప్రత్యేక అధికారి	హోదా	చేయాల్సిన విధులు
సీహెచ్ ప్రియాంక	అదనపు కలెక్టర్	ప్రజా పాలన జిల్లా ఇన్‌చార్జి
వెంకట్‌రెడ్డి	అదనపు కలెక్టర్	డాటా ఎంట్రీ ఇన్‌చార్జి
వీరబ్రహ్మచారి	ఆర్డీఓ సూర్యాపేట	డివిజన్ ఇన్‌చార్జి
సూర్యనారాయణ	ఆర్డీఓ కోదాడ	డివిజన్ ఇన్‌చార్జి
జగదీశ్వర్‌రెడ్డి	ఆర్డీఓ హుజూర్‌నగర్	డివిజన్ ఇన్‌చార్జి
యాదయ్య	డీపీఓ	హుజూర్‌నగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి
వెంటేశ్వర్లు	సీపీఓ	కోదాడ నియోజక వర్గ ఇన్‌చార్జి
సురేశ్	సీఈఓ జడ్పీ	సూర్యాపేట నియోజక వర్గ ఇన్‌చార్జి
కిరణ్‌కుమార్	డీఆర్‌డీఓ	తుంగతుర్తి నియోజక వర్గ ఇన్‌చార్జి

ప్రజా పాలన గ్రామ సభల పరిశీలన

- అర్వపల్లి : నేటి నుంచి జనవరి 6 వరకు జరిగే ప్రజా పాలన గ్రామ సభల ఏర్పాట్లను మండల ప్రత్యేక అధికారి రామారావునాయక్ బుధవారం కాసర్లపహాడ్, నాణ్యతండాలో పరిశీలించారు. ఇబ్బందులు లేకుండా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తాసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు అన్నారు. తనతో పాటు ఎంపీఓ సందీప్ ఆధ్వర్యంలో రెండు టీమ్‌లు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శశిధర్‌రెడ్డి, ఎంపీఓ సందీప్‌కుమార్, డీటీ కంట్లమయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.
- సూర్యాపేట రూరల్ : అభయ హస్తం గ్యారంటీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి ప్రజా పాలన దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నది. ఈ నేపథ్యంలో బుధవారం మండలంలోని ఆరెగూడెం, సఫావత్‌తండా గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణపై ముందస్తు ఏర్పాట్లను మండల ప్రత్యేక అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ భద్రూనాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, మిషన్ భగీరథ ఏఈ భరత్‌కుమార్, సీడీపీఓ కిరణ్మయి, పశు వైద్యాధికారి గోపి పాల్గొన్నారు.
- మఠంపల్లి : ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ ఏడీ సంధ్యారాణి అన్నారు. గ్రామ సభల నిర్వాహణపై గ్రామస్తులకు ముందస్తు సమాచారం అందించాలని తెలిపారు.
- తుంగతుర్తి : నేటి నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ భీమ్‌సింగ్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.
- నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలానికి తాసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శకరయ్య, మున్సిపాలిటీలోని 15 వార్డులకు ఇన్‌చార్జిలుగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మేనేజర్ అశోక్‌రెడ్డి వ్యవహరించనున్నారు. ఈ 28న బోడలోదిన్న, కందులవారిగూడెం, బూర్గుల తండా, రోళ్లవారిగూడెం, 29న దిర్శించర్ల, పెంచికల్‌దిన్నర, చిల్లేపల్లి, కల్లూరు, 30న దచారం, సోమారం, ముకుందాపురం, యల్లారం, జనవరి 2న మేడారం వైకుంఠాపురం, బక్కయ్యగూడెం, ఫత్తెపురం, 3న పుల్గంబండ తండాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 28న 1, 2, 3 వార్డులు, 29న 4, 5, 6 వార్డులు, 30న 7, 8 వార్డులు, జనవరి 2న 9, 10 వార్డులు, 3న 11, 12 వార్డులు, 4న 13వ వార్డు, 5న 14వ వార్డు, 6న 15వ వార్డులో ప్రజా పాలన నిర్వహించి దరఖాస్తులు స్వీకరించనున్నారు.
- నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ గాలి శోభారాణి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ, చేయూత పథకాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. 28న మాచిరెడ్డిపల్లి, పేరబోయిన గూడెం, శాంతినగర్, లక్ష్మాపురం, 29న ఈటూరు, నాగారం, 30న ఫణిగిరి, వర్ధమానుకోట, 2న నాగారం, బంగ్లా, మామిడిపల్లి, డి.కొత్తపల్లి, 3న పస్తాల, పసునూరు, 4న నర్సింహుల గూడెంలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.
- చిలుకూరు : నేటి నుంచి మండలంలో జరిగే ప్రజా పాలన గ్రామ సభల వివరాలను తాసీల్దార్ సరిత, ఎంపీడీఓ ఈదయ్య బుధవారం వెల్లడించారు. 28న ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం, దూదియతండా, జానకీనగర్, 29న బేతవోలు, నారాయణపురం, పోలేనిగూడెం, సీత్లాతండా, 30న చిలుకూరు, కొండాపురం, మాధవగూడెం, సీతారాంపురం, 2న ఆర్లెగూడెం, జెర్రిపోతులగూడెం, కొమ్ముబండతండా, రామాపురం, 3న రామచంద్రానగర్‌లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.
- ఆత్మకూర్.ఎస్ : నేటి నుంచి నిర్వహించే ప్రజా పాలన గ్రామ సభలపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారులు నాగేంద్రశర్మ, వెంకట్‌రెడ్డి అధికారులకు అవగాహన కల్పించారు. దరఖాస్తులు స్వీకరించిన అనంతరం రశీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, డీటీ పుష్ప, ఎంపీఓ సంజీవ పాల్గొన్నారు.

తిరుమలగిరిలో ప్రజా పాలనపై నియోజక వర్గం స్థాయి సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి, డిసెంబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులకు అందిస్తామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన నియోజక వర్గ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధుల ముందస్తు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోనే తుంగతుర్తి నియోజక వర్గం వెనకబడిన ప్రాంతం అని దీన్ని ఆదర్శ నియోజక వర్గంగా తీర్చి దిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, నియోజక వర్గ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కోదాడటౌన్ : ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి

నడిగూడెం, డిసెంబర్ 27 : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ సమస్యలు దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా మండలాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుక్రితం ఎమ్మెల్యేను అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతీమధుబాబు, జడ్పీటీసీ బాణాల కవితానాగరాజు, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఇమామ్, ఎంపీఓ లింగారెడ్డి పాల్గొన్నారు.

కోదాడ కోర్టు నిర్మాణానికి కృషి చేస్తా

కోదాడటౌన్ : కోదాడ కోర్టు భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి తెలిపారు. కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవబత్తిని నాగార్జున ఆధ్వర్యంలో పట్టణంలో ఎమ్మెల్యేను ఆమె నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాస్‌నాయుడు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, పగడాల రామచంద్రారెడ్డి, కెఎల్ఎన్.ప్రసాద్, సీతారామరాజు, పాషా, శ్రీధర్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం

కోదాడ వాసవీ క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. పట్టణంలోని వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మడి సతీశ్ ఆధ్వర్యంలో వీధుల్లో కూర్చోవడానికి వీలుగా ఏర్పాటు చేసిన 40 బెంచీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ముత్తవరపు పాండు రంగారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, పందిరి నాగిరెడ్డి, ఎస్ఎస్ రావు, రాయపూడి వెంకటనారాయణ, వెంపటి వెంకటేశ్వర్‌రావు, పైడిమర్రి సత్తిబాబు, ఓరుగంటి ప్రభాకర్ పాల్గొన్నారు.

వాహన తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలి

- డీఎస్పీ ప్రకాశ్

కోదాడ రూరల్ : సరిహద్దు వాహన తనిఖీని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రకాశ్

కోదాడ రూరల్, డిసెంబర్ 27 : రాష్ట్ర సరిహద్దు కోదాడ మండల పరిధి నల్లబండగూడెం శివారు రామాపురం క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను డీఎస్పీ ప్రకాశ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాహన తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

చివ్వెంల : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్ఐ రాములు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని దురాజ్‌పల్లిలో గల ప్రతిష్ట ఫార్మసీ కళాశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, రక్షణ, డయల్ 100, సోషల్ మీడియా, ఓటీటీ ఫ్రాడ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సాయి శంకర్, వెంకట్‌రెడ్డి, కళాబృందం ఇన్‌చార్జి ఎల్లయ్య, గోపయ్యాచారి, నాగార్జున, కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

- ఎన్‌సీఎల్ పరిశ్రమ సీనియర్ ప్రెసిడెంట్ చక్రధర్

రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

మఠంపల్లి, డిసెంబర్ 27 : రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడే దాతలు కావాలని ఎన్‌సీఎల పరిశ్రమ సీనియర్ ప్రెసిడెంట్ ఎస్.చక్రధర్ అన్నారు. బుధవారం మండలంలోని ఎన్‌సీఎల్ పరిశ్రమలో నాగార్జున సిమెంట్స్ ఆర్‌ఆర్ హెల్త్ సెంటర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో సేకరించిన 100 యూనిట్ల రక్తాన్ని నల్లగొండ, సూర్యాపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు అందజేయడం జరిగిందని పరిశ్రమ డాక్టర్ జి.శ్రీహరిరావు తెలిపారు. కార్యక్రమంలో బోర్డ్స్ వైస్ ప్రెసిడెంట్ రఘువర్మ, సీనియర్ డీజీఎం హెచ్‌ఆర్ సతీశ్, మేనేజర్ దస్తగిరిరెడ్డి, యూనియర్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవ రాజు, శ్రీనివాసాచార్యులు, బి.శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానం నుంచి రాష్ట్రం వైదొలగాలి

- కవి ప్రభాకర్

స్ఫూర్తి సభలో మాట్లాడుతున్న కవి, రచయిత కస్తూరి ప్రభాకర్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 27 : జాతీయ విద్యా విధానం నుంచి రాష్ట్ర ప్రభుత్వం వైదొలగాలని రచయిత, కవి కస్తూరి ప్రభాకర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రతిభా జూనియర్ కళాశాలలలో ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తి సభలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో కుల నిర్మూళన, శాస్త్రీయ విద్యపై పోరాటాలు నిర్వహించాలన్నారు. శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందించాలన్న అర్టికల్ 51ఏహెచ్‌కు విరుద్ధంగా డార్విన్ పరిణామ విధానాన్ని, పీరియాడిక్ టేబుల్‌ను, ప్రజాస్వామ్యాన్ని గూర్చిన పాఠాలను తొలగించడం భవిష్యత్ తరాలను అంధకారంలో నెట్టి వేయడమే అన్నారు. అందుకే రాష్ట్ర అవసరాలకు తగిన శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే పాఠ్యాంశాలను పాఠశాల విద్యా వ్యవస్తలో కొనసాగించాలన్నారు. సభలో పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, రిటైర్డ్ తాసీల్దార్ లింగంపల్లి భద్రయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాల లింగయ్య, టీపీటీఎఫ్ జిల్లా కన్వీనర్ కోటయ్య, పీడీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మరికంటి హరీశ్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

కోదాడ రూరల్, డిసెంబర్ 27 : కారు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం రంగయ్యగూడెం గ్రామానికి చెందిన పప్పుల రాములమ్మ (80) బస్టాండ్ నుంచి హుజూర్‌నగర్ రోడ్డు వైపు నడుచుకుంటు వెళ్తున్నది. ఎర్రకుంట కాల్వ సమీపంలోకి రాగానే ప్రసన్న కుమారు అనే వ్యక్తి కారును అజాగ్రత్తగా నడిపి వెనుకనుంచి వృద్ధురాలని ఢీకొట్టాడు. దాంతో తీవ్రగాయాలై వృద్ధురాలు అక్కడిక్కడే మృతి చెందింది. రాములమ్మ కుమారుడు సీతారామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ యాగవేందర్‌రెడ్డి తెలిపారు.

గడ్డివాము దగ్ధం

నాగారం, డిసెంబర్ 27 : మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన బుర్ర యాదగిరి పశువుల పాకలోని గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గడ్డివాము దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఎగసి పడుతున్న మంటలను ఆర్పేసింది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

సీపీఎం సీనియర్ నాయకుడు లక్ష్మారెడ్డి మృతి

ఆత్మకూర్.ఎస్, డిసెంబర్ 27 : సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, మండలంలోని నెమ్మికల్ గ్రామానికి చెందిన కోతి లక్ష్మారెడ్డి గుండెపోటుతో బుధవారం మృతిచెందారు. మృతదేహాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి సందర్శించి నివాళి అర్పించారు. లక్ష్మారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండ వెంకట్‌రెడ్డి, వేల్పుల వెంకన్న, మండల కార్యదర్శి అవిర అప్పయ్య, గ్రామ శాఖ కార్యదర్శి బెల్లంకొండ చక్రయ్య, గంపల ఎల్లయ్య, గోలి భాగ్యమ్మ, మూల విజయరెడ్డి పాల్గొన్నారు.

నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో గాంధీ విగ్రహావిష్కరణ

జడ్పీహెచ్ఎస్‌లో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వాసవీ క్లబ్ గవర్నర్ వెంకట గురుమూర్తి

నేరేడుచర్ల, డిసెంబర్ 27 : దేశ స్వాతంత్రం కోసం అసువులు బాసిన మహనీయుల జీవిత చరిత్రను నేటి తరం విద్యార్థులకు వివరించాలని వాసవీ క్లబ్ గవర్నర్ వంగవీటి వెంకట గురుమూర్తి అన్నారు. బుధవారం నేరేడుచర్ల జడ్పీ హెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యాభివృద్ధికి వాసవీ క్లబ్ సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. రానున్న పదో తరగతి పరీక్షలో 10/10 సాధించిన విద్యార్థులకు క్లబ్ డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ రాచకొండ శ్రీనివాస్‌రావు రూ.2 వేలు, క్లబ్ ఆధ్వర్యంలో సిల్వర్ కాయిన్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐపీసీ గరిణె అరుణకుమారి, వాసవీ వనితా క్లబ్ అధ్యక్షులు కొత్తా లక్ష్మణ్, వీరవల్లి శ్రీలతా, సెక్రటరీ గజ్జల కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.

వామనాశ్రమ మహా స్వామిజీ సూర్యక్షేత్ర సందర్శన

సూర్యక్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న వామనాశ్రమ మహా స్వామిజీ

అర్వపల్లి, డిసెంబర్ 27 : మండలంలోని తిమ్మాపురంలో గల సూర్యక్షేత్రాన్ని వైశ్య గురు మఠాధిపతి, కర్ణాటక హుల్దీపూర్ వామనాశ్రమ మహా స్వామిజీ బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో 102 వాసవిమాత దేవాలయాల్లో కోటి పుష్పార్చన కార్యక్రమం జరుగుతుందని, వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ వైశ్య గురు సేవా సమితి సభ్యుడు ఈగా దయాకర్‌గుప్తా, మిర్యాల శివకుమార్, బచ్చు పురుషోత్తమ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

- ఎంపీడీఓ ఇందిర

నూతనకల్, డిసెంబర్ 27 : మండల వ్యాప్త గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఎంపీడీఓ ఇందిర తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో ఎంపీఓ శశికళ పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల సర్వే

నూతనకల్, డిసెంబర్ 27 : మండలంలోని పెదనెమిల గ్రామంలో బుధవారం సీఆర్పీ కనకం రవీందర్ బడి బయట ఉన్న పిల్లల వివరాల నమోదుకు సర్వే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బడి బయట ఉన్న పిల్లల వివరాలను సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే నెల 14 వరకు సర్వే జరుగుతుందని చెప్పారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా చూసేందుకే సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

అర్వపల్లి, డిసెంబర్ 27 : జాజిరెడ్డిగూడెంలో యోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం గోదాదేవి నక్షత్ర, తులసీ పూజను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు రాంబాబు, పవన్, జాజిరెడ్డిగూడెం భక్త మండలి మహిళలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి వస్త్రాలంకణ సేవ

మేళ్లచెర్వు : ధనుర్మాస వేడుకల్లో భాగంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి వస్త్రాలంకణ సేవలను వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు ఈ సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణం, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో గల రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, కల్మల్‌చెర్వులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకోగా అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగు సరోజనమ్మ, ఆలయ మేనేజర్ మృత్యుంజయశాస్త్రి పాల్గొన్నారు.

అర్వపల్లి : గోదాదేవి నక్షత్ర పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PASSPORT LOST
KATTA ANANTHA REDDY S/O KATTA VEERA REDDY, R/o